క్లుప్తంగా

ప్రజాపాలన విజయోత్సవాలు

కడెం: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, భూషణ్, రాజు, బబ్లూ, సత్యంచారి, రాజన్న, రాజు, ధర్మయ్య ఉన్నారు.

కార్మికులకు వైద్యశిబిరం

నిర్మల్‌టౌన్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు రాంనగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీమంత్ అన్నారు. 150 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖమార్ అహ్మద్ పారిశుధ్య కార్మికులకు స్వెటర్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల దినోత్సవం



కేక్ కట్ చేసిన న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్మల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదుల దినోత్సవం నిర్వహించారు. బి.శుభకరన్, ఎస్.గోవర్ధన్, నూనె గంగాధర్, వి.మహేందర్, సీహెచ్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల సందర్శన

కుంటాల: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థినుల సంరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు కేజీబీవీ, కుంటాల ఆదర్శ పాఠశాలలోని వసతిగృహాలను పరిశీలించారు. వసతి గృహాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులతో సంరక్షణ కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేశ్‌గౌడ్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఎస్సై భాస్కరాచారి, ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, ఏఎస్సై రాందాస్, కార్యదర్శి భోజన్న ఉన్నారు.

కడ్తాల్ వాసికి డాక్టరేట్



కిషన్

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన కత్రోజి కిశోర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మంగళవారం డాక్టరేట్ అందుకున్నారు. 'స్ట్రక్చరల్ మ్యాపింగ్ బై రిమోట్ సెన్సింగ్ అండ్ మాగ్నెటిక్ మెథడ్స్ ఇన్‌సైట్స్ అఫ్ సూర్యాపేట అండ్ నల్గొండ రీజియన్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఇండియా 'అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలోని జియోఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.ఉదయలక్ష్మి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు కిశోర్ డాక్టరేట్ అందుకున్నారు.

స్పోర్ట్స్‌మీట్‌లో 'విజయ' సత్తా

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో పట్టణానికే విజయ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఏడు బంగారు, ఏడు కాంస్యం, ఏడు రజత పతకాలు సాధించి అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. విద్యార్థులను పాఠశాల వైస్ ప్రెసిడెంట్ అంబారాణి, కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం అభినందించారు.

ప్రొసీడింగ్ అందజేత

భైంసాటౌన్: మండలంలో చేపట్టే అభివృద్ధి పనులకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు జి.విఠల్‌రెడ్డి .. ఆయా గ్రామాల ప్రజలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కుంభి గ్రామంలో రూ.4లక్షలు, కోతల్‌గాంలో రూ.7లక్షలు, తిమ్మాపూర్‌లో రూ.3 లక్షలు, వానల్‌పాడ్‌లో రూ.5లక్షల విలువైన పీఆర్ రోడ్లు మంజూరయ్యాయి. మంగళవారం పట్టణంలోని గడ్డెన్న నివాసంలో గ్రామస్తులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, పోతారెడ్డి, రాంకుమార్, గణేశ్, గజానన్, ముత్యంరెడ్డి, సాహెబ్‌రావు, ప్రసాద్ తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

లోకేశ్వరం: మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని తహసీల్దార్ మోతీరాం అన్నారు. మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమేశ్, ఎంఈవో చంద్రకాంత్, నిర్వాహకులు ఉన్నారు.

తానూరు: పాఠశాలలో శుభ్రతపై దృష్టి సారించాలని తహసీల్దార్ లింగంమూర్తి సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. ఎంపీడీవో అబ్దుల్‌సమద్, ఎంఈవో నరేందర్, ఎంపీవో నసీరుద్దీన్, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కూరగాయల సాగుతో లాభాలు

- ఆదర్శంగా తరోడా గ్రామరైతులు
- సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించాలని వినతి

మూస పద్ధతిలో సంప్రదాయ పంటలు పండించకుండా.. ఇగురంతో కూరగాయలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు ముధోల్ మండలంలోని తరోడా గ్రామ రైతులు. ఏడాది పొడవునా స్ప్రింక్లర్లు, డ్రిప్ విధానంలో పండించిన పంటలను అంగళ్లలో విక్రయిస్తున్నారు. తాజా.. తాజాగా కూరగాయలు అందిస్తుండటంతో వెంటనే అమ్ముడుపోతున్నాయని ఈగ్రామ రైతులు అంటున్నారు. ఒకరిని చూసి మరొకరు కూరగాయలు సాగు చేస్తూ ముందుకు సాగుతున్నారు.



తరోడాలో సాగు చేసిన కూరగాయల తోట



తోటలో రైతు ఏర్పాటు చేసిన స్ప్రింకర్లు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో రైతులు కూరగాయలు సాగు చేస్తూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. మండలకేంద్రంతోపాటు విఠోలి, తరోడా, ముధోల్‌లో నీటి వృథాను కట్టడి చేస్తూ.. స్ప్రింక్లర్లు, డ్రిప్పు సాయంతో కూరగాయలు పండిస్తున్నారు. ఏటా ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయని.. ఆదాయం రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

300 ఎకరాల్లో సాగు..

మండలంలోని తరోడా గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో క్యాబేజీ, పువ్వుగోబి, వంకాయ, టమాటా, బీరకాయ, బెండకాయ, మిర్చి, దొండకాయ, కాకరకాయ, చిక్కుడుకాయ తదితర కూరగాయలను పండిస్తున్నారు. రెండు ఎకరాలున్న రైతు బెండకాయ, వంకాయ, ఆకుగోబి సగం విస్తీర్ణంలో పండిస్తూ.. మిగతా సగం ఇతర పంటలను సాగు చేస్తున్నారు. తీరొక్క రకాల కూరగాయలు సాగు చేయడం వలన ఒక దాంట్లో రాకపోయినా మరో దాంట్లో లాభం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

ఇతర ప్రాంతాలకు తరలింపు..

పెద్దమొత్తంలో కూరగాయలు సాగు చేసిన రైతులకు స్థానికంగా మార్కెట్ లేదు. దీంతో కొందరు కూరగాయలను మహారాష్ట్రలోని ధర్మాబాద్, భోకర్‌తోపాటు, నిజామాబాద్ జిల్లా, భైంసా పట్టణాలకు ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లి అక్కడి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కూరగాయలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండటంతో మంచి లాభాలు వస్తున్నట్లు పేర్కొన్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



15 ఏళ్లుగా కూరగాయలు పండిస్తున్నాం. నాకున్న ఐదెకరాల్లో వంకాయ, బీరకాయ, బెండకాయ, కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో టమాట సాగు చేస్తున్నా. అధికారులు స్పందించి ముధోల్‌లో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే మాలాంటి రైతులకు మరింత మేలు కలుగుతుంది. ఒక్కోసారి నేనే ఊరూరా తిరిగి అమ్ముతా. – శేఖర్, తరోడా

సబ్సిడీ విత్తనాలు అందించాలి



మూడు ఎకరాల్లో క్యాబెజీ, అరఎకరంలో టమాటా సాగు చేస్తున్నా. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విత్తనాలు కూరగాయల సాగులో ప్రోత్సహించాలి. ప్రస్తుతం మంచి ఆదాయమే పొందుతున్నాం. వ్యవసాయాధికారులు మా తోటల వద్దకు వచ్చి అధునాతన సాగు పద్ధతులను వివరించాలి. – హకీం, తరోడా

రాయితీపై పరికరాలు అందించాలి



మూడెకరాల్లో బీరతోట సాగు చేస్తున్నా. రైతులకు డ్రిప్పు పరికరాలతోపాటు స్ప్రింక్లర్లను రాయితీపై అందిస్తే బోరులో కొద్దిపాటి నీరున్న పంటలకు అందిస్తాం. ఒకరిని సాగు మరొకరం కూరగాయలు సాగు చేస్తున్నాం. అధికారులు సైతం మాకు సహకరించాలి. – నలీస్, తరోడా

ఉన్నతాధికారులకు వివరిస్తాం

స్ప్రింక్లర్లు, డ్రిప్‌పైపులను సబ్సిడీపై అందించాలనే రైతుల విజ్ఞప్తులను సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. గతంలో డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరు రైతులకు అందించాం. పరికరాలు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకుంటే.. ప్రభుత్వం నుంచి రాగానే అందిస్తాం. – జావిద్‌పాషా, ఉద్యానవనశాఖ అధికారి

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మంగళవారం ఎస్ఎస్ కాటన్‌లోని తన నివాసంలో పలువురు బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. ముధోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన దేవిదాస్‌కు రూ.52,500, ముత్తవ్వకు రూ.42వేలు, బోరిగాంకు చెందిన ముత్తవ్వకు రూ.23వేలు, భైంసా మండలంలోని దేగాంకు చెందిన విశ్వనాథ్‌కు రూ.24వేలు, బిజ్జూరుకు చెందిన లింగారెడ్డికి రూ.18వేల విలువైన చెక్కులను అందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్ గ్రామ సమీపంలో నిర్మించే వంతెనకు పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.54లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ భూమిపూజ చేశారు. ఎన్నికల వేళ అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే విమర్శించారు. బోయిడి విఠల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, జిల్లా కార్యదర్శి గంగాధర్, బీజేపీ మండల అధ్యక్షుడు దత్తాత్రి, నాయకులు గులాబ్, తోకల మారుతి, గంగాధర్, గణేశ్, అశోక్, హన్మంతు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

లోకేశ్వరం: అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముధోల్ ఏడీఏ వినయ్‌బాబు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేశారు. ఎరువు నిల్వల రికార్డులను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించి రైతులకు రశీదులు అందించాలని నిర్వాహకులకు ఏడీఏ సూచించారు. ఏవో గిరిధర్, ఏఈవో భూమేశ్, తదితరులు ఉన్నారు.

శ్రీకాంతాచారికి నివాళి



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



కడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం ముందు స్వర్ణకార సంఘం నాయకులు శ్రీకాంతాచారి చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

కడెం: మండలకేంద్రంలో శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు. స్వర్ణకార సంఘ మండలాధ్యక్షుడు ఎనుగుర్తి సదానందం, శంకర్, వినయ్, వెంకటచారి, సతీశ్, రఘు, ప్రహ్లాద్ తదితరులున్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు.

దివ్యాంగులు దృఢచిత్తంతో ముందుకెళ్లాలి

కుంటాల: దివ్యాంగుల్లో ప్రతిభకు కొదువ లేదని.. వారు దృఢచిత్తంతో ముందుకెళ్లాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కుంటాల భవిత కేంద్రంలో మాట్లాడారు. ఆటల పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంఈవో ముత్యం, ఎంపీవో రహీంఖాన్, హెచ్ఎం పుష్పలత, కార్యదర్శి రాజబాపు, ప్రసాద్ పాల్గొన్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన గోస్కుల రాకేశ్ అనే దివ్యాంగుడు ఇటీవల జిలా స్థాయి ట్రైసైకిల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. మంగళవారం ఆయనను గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.



బహుమతులు అందజేస్తున్న డీపీవో శ్రీనివాస్

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. పోశెట్టి, శ్రీనివాస్, సాజిద్, సుధాకర్, నాగరాజు, జావిద్ తదితరులు ఉన్నారు.

వైభవంగా శోభాయాత్ర

- రేపు విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక వాహనంలో విగ్రహాల శోభాయాత్ర



గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాకారులు

ముధోల్: మండలంలోని అష్ట గ్రామంలో రామాలయంలో ప్రతిష్ఠించే సీతారాముల విగ్రహాల శోభాయాత్ర మంగళవారం నిర్వహించారు. వేకువజామున గ్రామస్తులు గోదావరి జలాలను తీసుకొచ్చి ఆలయం శుభ్రం చేసి ప్రతిమలకు అభిషేకం చేశారు. ఆలయం గర్భగుడి ప్రాంగణంలో గణపతి హోమం, పూజ కుటీర హోమం, గోపూజ, యాగశాల ప్రవేశం చేశారు. శ్రీ రామచంద్రుని ఉత్సవ విగ్రహాలతో వైభవంగా పద్మశ్రీ కనకరాజు శిష్య బృందం గుస్సాడీ నృత్యాలతో కనువిందు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికే చెందిన విగ్రహాల దాత సంతోష్‌రెడ్డి హోమంలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన బండి శ్రీను గుస్సాడీ నృత్యానికి అయ్యే ఖర్చులను భరించాడు. బుధవారం యాగశాల హోమం చేపట్టనున్నారు. గురువారం సీతరాముల విగ్రహ ప్రతిష్ఠాపన, మహాపూజ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ రంగంపేట పీఠాధిస్వాములు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వాముల చేతులమీదుగా ప్రతిష్ఠాపన చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు వీడీసీ సభ్యులు తెలిపారు.

నేడు ప్రత్యేక సమావేశం

సోన్: మండలంలోని సోన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పాఠశాలల భద్రత, మధ్యాహ్న భోజనం, సీఎం కప్ పోటీల నిర్వహణపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, కేజీబీవీ ఎస్‌వో, లెఫ్ట్ పోచంపాడు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఈఓ, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులు, ఎస్సై రావాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ హాజరవుతారని పేర్కొన్నారు.

అపరిచితులకు ఓటీపీలు చెప్పొద్దు



భైంసారూరల్: అవగాహన కల్పిస్తున్న సీఐ నైలు

భైంసారూరల్: అపరిచితులకు ఆధార్ వివరాలు, ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పొద్దని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని మాటేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రైసింగ్‌వన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైతే 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. బ్యాంకు అధికారులు ఫోన్ చేసి ఎలాంటి ఓటీపీలు అడగరని.. ఈవిషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, ముజ్జె రవి, రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డయల్ 100పై అవగాహన

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం డయల్ 100, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సుమలత మాట్లాడుతూ సోషల్ మీడియాకు దూరం ఉండి.. చదువుపై మాత్రమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. పీసీలు గణేశ్, సంతోష్, వెంకటి, కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులకు సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆపద వస్తే ఆందోళన చెందకుండా 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, ప్రత్యేకాధికారి జ్యోతి, సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో ఎస్సై శ్రీకాంత్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, వినోద్, ఆకాశ్ తదితరులున్నారు.

భైంసాటౌన్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలగాలని పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ఎస్సై అశోక్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

తానూరు: మండలకేంద్రంలోని కేజీబీవీ, భోసి గ్రామ జెడ్పీ పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్సై రమేశ్ అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఎస్సై కె.గోపి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఏఎస్సై హైమద్ తదితరులున్నారు.

సోషల్‌మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

నిర్మల్‌రూరల్: సోషల్ మీడియా వినియోగంలో మహిళలు జాగ్రత్తలు పాటించాలని నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని డ్యాంగాపూర్ మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళల భద్రత అన్ని చర్యలు తీసుకుంటున్న వివరించారు. ఆకతాయిల వేధింపులకు గురిచేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్సై లింబాద్రి, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

కడెం: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ వసతిగృహంలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

లోకేశ్వరం: మండలకేంద్రంలోని బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను మంగళవారం పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్వీ గురుకుల బాటలో భాగంగా వసతిగృహం సందర్శనకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం సరికాదని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపె శ్యాంసుందర్, ప్రశాంత్, దిగంబర్, సాయన్న, అనిల్, హరీశ్, నరేశ్ ఉన్నారు.

'ముధోల్‌పై చిన్న చూపు తగదు'

కుంటాల: రాష్ట్ర ప్రభుత్వం ముధోల్ నియోజకవర్గాన్ని చిన్నచూపు చూడటం తగదని.. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నాయకత్వంలో ఎన్నికల హామీలను నెరవేర్చుకుందామనే కరపత్రాన్ని మంగళవారం కుంటాలలో బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. బాసర ఆలయాన్ని రూ.42 కోట్లతో పునర్‌నిర్మించడం, సుద్దవాగు ప్రాజెక్టు ముంపు గ్రామమైన గుండెగాం గ్రామస్తులకు పునారావసం కల్పించడం, బాసర ట్రిపుల్ ఐటీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం, రాజేశ్‌బాబు, తలోడ శ్రీనివాస్, రమణరావు, కేశెట్టి అశోక్ కుమార్, గౌస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం'

లోకేశ్వరం: ప్రజా ఆశీర్వాదంతో ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుతోందని ప్రోగాం కన్వీనర్ రాజేశ్‌బాబు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాలోడ్ శ్రీనివాస్, శ్రీధర్, చిన్నారావు, సుమన్ కుమార్, జయసాగర్‌రావు, జీవన్, రవీందర్‌రావు, అనిల్ పటేల్, రమేశ్, భాస్కర్ ఉన్నారు.

'పెండింగ్ డబ్బులను చెల్లిస్తేనే సర్వే'

కుంటాల: గతంలో నిర్వహించిన ఎన్నికల, పల్స్ పోలియో విధులు, లెప్రసీ సర్వే డబ్బులను ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ మండలంలోని ఆశవర్కర్లు మంగళవారం కుంటాల వైద్యశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బుధవారం నుంచి నిర్వహించే సర్వే చేపట్టబోమని స్పష్టం చేశారు. వైద్యురాలు అమృతయాని, సూపర్‌వైజర్ సుజాతకు వినతిపత్రం అందించారు. ఆ సంఘం మండల కన్వీనర్ ఇంద్రమాల, ఆశవర్కర్లు ఉన్నారు.

'మూసిన గేటు తెరిపించాలి'

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గతంలో మూసివేసిన గేటును తిరిగి తెరిపించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాంకేతికత పెరుగుతున్న ఈరోజుల్లో వాస్తు పేరిట మూఢనమ్మకాలు పాటించడం సరికాదని పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం సరికాదు'

భైంసాటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ముధోల్ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ తాలూకా నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధితో ఉందన్నారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, త్వరలోనే రూ.2500 భృతి అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిగా నియోజకవర్గంలో అభివృద్ధి చేయని ఎమ్మెల్యే.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాంనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, రాంచందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్ షెడ్డు ఏర్పాటుచేయాలి

కడెం: మండలానికి మంజూరైన 108 అంబులెన్స్‌కు షెడ్డు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్ తదితరులున్నారు.

ఆశవర్కర్ల వినతి

లోకేశ్వరం: తమకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశవర్కర్ల సంఘం మండల అధక్ష్యురాలు ఆయిటి ఆనందకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలు తేజస్వినికి వినతిపత్రం అందజేశారు. ఆశా కార్యకర్తలు శారద, గంగామణి, మమత, రాణి, కమల, స్వప్న, కల్యాణి, సవిత, అనిత, గోదావరి ఉన్నారు.

ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కలిసిన నేతలు

ఖానాపూర్: ఇచ్చిన హామీకి కట్టుబడి రెండోవిడత రుణమాఫీ చేయడంపై సత్తన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ అమంద శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సత్తన్‌పల్లి పీఏసీఎస్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను హైదరాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పరిధిలో రుణాలు మాఫీ అయ్యేలా చూడాలని కోరారు.

కలప పట్టివేత

కడెం: దస్తురాబాద్ మండలంలోని మున్యాల్ సమీపంలో మంగళవారం ఎఫ్ఎస్‌వో కింగ్‌ఫిషర్ కలపను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో గీతారాణి తెలిపారు. పట్టుబడిన నాలుగు కలప దుంగలను కడెం రేంజ్ కార్యాలయానికి తరలించామని.. వాటి విలువ రూ. 25 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

నివాళి

కుంటాల: కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ శివారులోని సుద్దవాగు ప్రాంతంలో మంగళవారం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్సై అశోక్ తెలిపారు. వాగు నుంచి అక్రమంగా ఇసుక తీసుకెళ్తున్న మండలంలోని హథ్‌గాంకు చెందిన ట్రాక్టర్‌కు రూ. 5వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.